

# స్పందన

శేషభట్టరు సీతాదేవి

ఉదయాన్నే నిద్రలేచి ముందుగా పేపరు చూడటం అలవాటు చాలా మంది లాగానే నాకూ ఉంది. మెయిన్ పేపర్లో రాజకీయాలు చూడటం అయింది. జిల్లా ఎడిషన్ తీశాను. అందులో ఒక వార్త నా మనస్సుని బాగా ఆకట్టుకుంది.

"ఔట్‌స్టాండింగ్ టీచర్ అవార్డు ఫ్రమ్ చికాగో యూనివర్సిటీ రికమెండెడ్ బై స్టూడెంట్సు ఆఫ్ చికాగో యూనివర్సిటీ." ఆ విద్యార్థి, ఉపాధ్యాయుడు తెలుగువారే. వారి పేర్లు, ఫోటో కూడా వేశారు.

అమెరికాలోని చికాగో యూనివర్సిటీలో ఒక విశిష్ట సంప్రదాయం ఉంది. అందులో చదివే విద్యార్థులు, పాఠశాలలో చదివేటప్పుడు వారిని ప్రభావితులను చేసి, వారిలోని ప్రజ్ఞా విశేషాలను వెలికితీసి, వారిని అభివృద్ధి పథానికి నడిపించిన ఉపాధ్యాయులను గుర్తించి, వారికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందచేయటం.

ఈ వార్త నా కెంతో సంతోషంగా, విశేషంగా అనిపించింది. రాత్రి పడుకున్నా అదే వార్త నా మనసులో మెదులుతూంది. నా కెందు కింత సంతోషంగా ఉందా అని ఆలోచించాను. ఎంతో శ్రమపడి విద్యార్థులని తీర్చిదిద్దిన ఉత్తమ ఉపాధ్యాయుడికి జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది అని కాబోలు. మరునాడు నా స్నేహితుడు వెంకట్రావు వస్తే ఈ వార్త ఎంతో ఉత్సాహంతో చెప్పాను.

"నేనూ చూశాను లేరా! ఫారిన్ వాళ్లు చేస్తేగానీ ఏదీ మనకి గొప్పగా కనబడదు" అన్నాడు తేలికగా.

"అది కాదురా! ఇప్పుడు మన రాష్ట్రంలోనూ, దేశంలోనూ సన్మానాలు జరిగే తీరు చూస్తున్నాం కదురా, రాజకీయ నాయకులు రికమెండ్ చేస్తేగానీ ఎంత మంచి ఉపాధ్యాయునికైనా అవార్డులు రావుగదా" అన్నాను. "ఉపాధ్యాయులే ఎవరికి వారు మేము ఇంత గొప్పవాళ్లం అని అప్లికేషన్ కూడా పెట్టాలట. స్కూలు బిల్డింగ్‌లకి, ఎంత చందా వసూలు చేస్తే అంత మంచిదట. ప్రముఖ వ్యక్తులతో ఎంత ఎక్కువ పరిచయం ఉంటే అంత గట్టి రికమెండేషన్‌ట. సాహిత్య కార్యక్రమాలలో, సంఘ సేవా కార్యక్రమాల్లో ఎంతగా పాల్గొంటే అంత క్రెడిట్‌టే.

వీటన్నిటితోపాటు వాళ్ళు చెప్పే సబ్జెక్టులో మంచి శాతం కూడా రావాలిట. ఇవీ అవార్డుకి అర్హతలలో కొన్ని" అన్నాను.

"నిజానికి విద్యార్థులని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే తపన గల ఉత్తమ ఉపాధ్యాయులకి తమ గొప్పలు తాము చెప్పుకుంటూ అవార్డు కోసం అప్లికేషన్ పెట్టాలనుంటుందంటావా?" అన్నాడు వెంకట్రావు.

"కరెక్ట్."

"అలాంటి ఉపాధ్యాయులకి నిస్వార్థంగా తమ వృత్తికి అంకితం అయిపోవడమే ధ్యేయంగా ఉండచ్చు." వెంకట్రావు చెప్పటం మొదలుపెట్టాడు.

ఎవరు ఏం చెప్పినా శ్రద్ధగా వినటం అనేది నా అలవాటు.



ఆ పట్టణం పేరు నిర్మలాపురం. మానవతా సంఘం అనే ప్రసిద్ధి చెందిన సంఘం ఒకటుంది అక్కడ. వారు మానవసేవ బాగానే చేస్తూంటారు. అందులో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం. వారికి పట్టణం నడిబొడ్డులో "మానవతా మందిరం" అనే విశాల భవనం ఉంది. విద్యుద్దీపాల కాంతితో ఆ రోజు మానవ మందిరం శోభాయమానంగా ఉంది. ఎత్తైన వేదిక మీద సింహాసనాల లాంటి కుర్చీలు, మైకులు ఉన్నాయి. హాలు నిండా మామూలు కుర్చీలు ప్రేక్షకుల కోసం.

ప్రేక్షకులలో శ్రీనివాసరావు కొంచెం వెనక వరుసలో ప్రకాష్‌తో సహా కూర్చున్నాడు. ప్రార్థన, మానవతా సంఘం వారి ఆశయాలు, ఆత్మస్తుతి అయ్యాయి.

అధ్యక్షోపన్యాసంలో వేదిక నలంకరించిన ప్రముఖులందరికీ పేరు పేరు వరుసనా నమస్కారాలయ్యాయి. తదనంతరం -

"ఈ రోజు చాలా సుదినం. ఈ రోజు ప్రాముఖ్యం మనందరికీ తెలును. ఆ సందర్భంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో తమ సబ్జెక్టులో నూరుశాతం విద్యార్థులు కృతార్థు లవటానికి ఎంతో కృషి చేసిన త్రిమూర్తులు మేష్టారికి చంద్రుని కొక నూలుపోగులాగ యథాశక్తి సన్మానం చేస్తున్నాం. ఈ సందర్భంలో పట్టణ ప్రముఖ వ్యక్తి, స్థానిక శాసనసభ సభ్యుడు, యువజన నాయకుడు అయిన శ్రీ వి.కన్నాగారిని ఆదర్శ ఉపాధ్యాయుడైన శ్రీ త్రిమూర్తులుగారిని సన్మానం చేయవలసినదిగా కోరుతున్నాం."

శ్రీ వి.కన్నా గారంటే ఏ ఉత్తర దేశస్థుడో అనుకుంటే పొరపాటే. ఆయన అచ్చమైన ఆంధ్రుడే. శ్రీ కన్నాగారు శ్రీ త్రిమూర్తులు గారిని సన్మానించారు. దుశ్శాలువ కప్పారు. రెండు మూడుసార్లు కెమేరాలు తళుక్కున మెరిశాయి. అర్జెంటు పని ఉండటం మూలంగా కన్నాగారు సభ నుండి వెళ్ళిపోయారు. త్రిమూర్తులు గారి గుణగణాలను సభలోని పెద్దలంతా ఒకరి తర్వాత ఒకరు తమ వాక్చాతుర్యాన్ని చూపిస్తూ ప్రశంసించారు.

'టీచింగ్ ప్రొఫెషన్ ఈజ్ ది నోబ్లెస్ట్ ప్రొఫెషన్' అన్నారు కళాశాల ప్రిన్సిపాల్ గారు.

ఒక వయసు మళ్లిన పండితుడు "గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః" శ్లోకం పాడుతూ అర్థాన్ని వివరించారు. ఈయ నేమిటో శ్లోకాలు తీస్తున్నా డేంటిరా అంటూ వెనుక వరస నుండి గొంతుకలు వినబడుతున్నాయి.

"విదేశాలలో అయితే విద్యార్హతనుబట్టి వేతనాలు నిర్ణయిస్తారు. సమాజంలో ఉపాధ్యాయుల పరిస్థితి ఈ రకంగా మెరుగుపడిందంటే మా సంఘాల కృషే కారణం" అని ఉపాధ్యాయ సంఘాల నాయకుడు నొక్కి వక్కాణించారు. సభలో చప్పట్లు గట్టిగానే మోగాయి.

పాఠశాల విద్యార్థి నాయకుడు తనకి కూడా మాట్లాడేందుకు అవకాశం. ఇమ్మని అడిగాడు నిర్వాహకులని. ఉపాధ్యాయులకి సన్మానం చేసేటప్పుడు విద్యార్థులు తప్పకుండా పాల్గొనాలంటూ అతనికి అవకాశం ఇచ్చారు.

"పాఠశాల అనే నదిని దాటించే నావికుడు భారతాల్లాంటి పుస్తకాలను బట్టీపట్టే బాధ తప్పించే బంధువు.

"మాకే ప్రశ్నపత్రాల గండం నుండి కడతేర్చే గంభీరుడూ పరీక్షలకు సుశిక్షణ నిచ్చి ఆదుకునే ఆపద్బాంధవుడు, ఈతడే మా ఆదర్శ ఉపాధ్యాయుడు.

"అందుకే మేం చేస్తాం ఈయనకు సన్మానం." అన్నాడో లేదో లయబద్ధంగా 5 నిముషాలు కరతాళధ్వనులు మారుమోగాయి.

ఈ సందర్భంలో ప్రకాష్ గురించి కొంచెం చెప్పకతప్పదు. ప్రకాష్ ప్రతి సంవత్సరం తన తరగతిలో తానే మొదటివాడు. స్కాలర్‌షిప్ పొందుతున్నాడు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 5వ ర్యాంకు - రాష్ట్రస్థాయిలో - వచ్చాడు. అతనికి మానవతా సంఘం వారు బంగారు పతకం, సర్టిఫికెట్ ఇస్తాం రమ్మని కబురుచేశారు. త్రిమూర్తులు గారి సన్మానం తర్వాత వేదిక మీదకి పిలిచి బంగారు పతకాన్ని రిబ్బను కట్టి మెడలో వేశారు. కెమెరా మెరుపులు, చప్పట్లు. సభ ముగిసింది.

ఇంటికి వెడుతూ దారిలో ప్రకాష్ లేత బుర్రలో ఎన్నో ఆలోచనలు. తనకు బంగారు పతకం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కాని తనకు ఆ పతకం రావటానికి కారణం ఎవరు? వెంకటేశ్వరరావు మేష్టారు!

"ఆయన ఏనాడూ క్లాసుకి రావటం మానరు. ఆలస్యంగా కూడా ఎప్పుడూ రారు. రెండవ బెల్లు మోగేటప్పటికి క్లాసులో ఉంటారు. ప్రకాష్‌కి నూరు శాతం హాజరుకి స్కూల్లో బహుమతి కూడా వచ్చింది. పాఠాలు ఎంతో శ్రద్ధగా ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేటట్లు చెబుతారు. వారం వారం ఎసైన్‌మెంట్ పెట్టి దిద్ది ఆ తప్పులు మళ్లీ రాకుండా ఉండటానికి ఎంతో కృషి చేస్తారు. ఇంగ్లీషు గ్రామరు చెప్పేటప్పుడు, తెలుగు వ్యాకరణంతో పోల్చి చెబుతారు. అందువల్లే తను ఇంగ్లీషు వక్తృత్వంలో మొదటి బహుమతులు పుచ్చుకుంటున్నాడు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం ప్రభావం విద్యార్థికి జీవిత మంతా పనిచేస్తూనే ఉంటుంది" అని ఆలోచిస్తూ నడిచాడు ఇంటికి. నిజంగా వెంకటేశ్వరరావు మేష్టారికి కూడా సన్మానం చెయ్యాలి. మేష్టారి క్కూడా సన్మానం చెయ్యాలి.

త్రిమూర్తులు మేష్టారి సన్మానం - పోనీలే! మన కెందుకు? ప్రకాష్ చిన్న బుర్రలో అనేక ఊహలు. ఏమైనా సరే! వెంకటేశ్వరరావు మేష్టారికి ఏమైనా తన పాకెట్‌మనీతో ఇవ్వాలి.

"మే ఐ కమిన్ సర్!" అన్న మాటలు విని ద్వారం వైపు చూశారు మేష్టారు. వినయ విధేయతలతో, విజ్ఞానం, వివేకం మూర్తీభవించినట్లున్న ప్రకాష్, అతని చేతిలో చక్రకేళీ అరటిపళ్ల అత్తం.

"ఏమోయ్ ప్రకాష్! ఏమిటీ ఇలా వచ్చావ్" కంగ్రాచులేషన్స్ ఫర్ గెట్టింగ్ స్టేట్ రాంక్" అన్నారు మేష్టారు.

"మేష్టారూ! అంతా మీ దయ అండీ." ఆ ఫలాలను మేష్టారి చేతిలో ఉంచి వంగి కాళ్ళకి నమస్కారం చేశాడు.

"ఇదేమిటి బాబూ! నీవు కష్టపడి చదువుకున్నావు. నీ కృషి ఫలించింది. భవిష్యత్తులో కూడా ఇలాగే ర్యాంకులు సంపాదించుకొని వృద్ధిలోకి రా! ఇదంతా కాంపిటీషన్ యుగం. నా కెందుకు బాబూ ఇవన్నీ. మీరు అభివృద్ధిలోకి రావటమే మాకు సంతోషం, నిజమైన గుర్తింపు."

"మేష్టారూ! ఎంతో శ్రమపడి విద్యార్థులని తీర్చిదిద్దే మీలాంటి ఉపాధ్యాయులని సమాజం గుర్తించదేం" అన్న భావం ప్రకాష్ ముఖంలో కనబడుతూంది.

ప్రకాష్ భావానికి సమాధానం అన్నట్లుగా క్లాసులో ఒక చురుకైన విద్యార్థి "ఇది మా విద్యార్థుల తరపున చేసే సన్మానమండీ" అన్నాడు.

మేష్టారు పాఠం చెప్పటంలో నిమగ్నమయిపోయారు. మేష్టారు స్థితప్రజ్ఞుడు.

"ఒరే వెంకట్రావ్! నిజంగా ఆ మేష్టారి ఔన్నత్యం, నిర్మలత్వం, ప్రకాష్ స్పందన కళ్లకి కట్టినట్లుగా చిత్రశైలిలో చెప్పావురా! ఇంతకీ ఆ ప్రకాష్ ఎవరురా!"

వెంకట్రావు భావగర్భితంగా చిరునవ్వు నవ్వాడు. ●